గుడ్డిపిల్ల

అడివి బాపిరాజు గారు

(ఒక చిన్న కథ)

౧

తాడేపల్లిగూడెం స్టేషన్లో ఎక్కింది ఆ బాలిక బెజవాడబండి. కూడా ఒక చిన్నపిల్లవాడు ఆ బాలిక చేయిపట్టుకుని దారి చూపుతూ వున్నాడు. చినిగిపోయిన గుడ్డల్లో మేఘాల్లో చంద్రుడులా వుంది ఆమె. ఆమె అందం ఆమెకే తెలీదు.

"వినవే పల్లవా మృదూచరణా
కరుణా-వితరాణా గూణా భరాణా!"

అని పల్లవి ప్రారంభించింది. ఒక్కసారిగా పెట్టెఅంతా నిశ్శబ్దం ఆవరించింది. విరిసిన వసంతోదయంలో మల్లికాపుష్ప సుగంధంలా ఆకిన్నెరస్వనం, మహావేగంతో పరుగెత్తుతున్న రైలు హోరు శ్రుతికాగా, ఆపెట్టెఅంతా ప్రవహించింది.

"జనవిభు డానతిచ్చిన దండాకాటవికి—"

అందరి హృదయాలు కదలిపోయినవి. కొండచిలువ పెనవేసుకున్న జింకల్లా చైతన్యం రహితమై వింటున్నారు యావన్మందిన్నీ.

"మునివేషధారినై చనియేద ననా వీని—"

ఎవరిభావగాంభీర్యం ఎంతవుందో ఆలోతు వినీలమై, వినిర్మలమై కాంతి తాల్చింది.

ఆమె తలముడి కంగారుగా విడిపోయి నీరులేని మేఘంలా చెదిరివుంది. కళ్లు చూస్తూ వున్నట్లే వున్నవి కాని సంజ్ఞాజ్ఞాన రహితాలై ఎండిపోయిన చెరువుల్లా మెరుస్తున్నవి. తీర్చి దిద్దిన కనుబొమలు, సమమైన ముక్కు, చిన్న నోరు, వణికేపెదవులు ఆమె మోహన సుందర శ్రీ సాక్షాత్కరింప చేస్తూవున్నవి.

ఆమెపాట ఒక సెలయేరులా మర్మరించింది; రాళ్లగుట్టలో జలజలలాడింది; సుడిగుండాలు చుట్టింది; చెట్లనీడ సమతలంలో పోయింది; ఆగింది; ఒక బండరాయి కింద మాయమై, అవతల తిరిగి ప్రత్యక్షమైంది.

ఆగానం శ్రావణమాసపు పచ్చికలా అల్లుకుపోయింది. శరదృతు పుష్పాలై వికసించింది. నవవసంతం వల్లే ఆనంద పర్వమై పోయింది.

౨

అప్పుడే ఒక స్టేషనులో ఎక్కాడు ఒక బ్రాహ్మణోత్తముడు. వచ్చీరాగానే ఆపాటకు అడ్డంవస్తో ఒక హాస్యవచనం అన్నాడు. ఆత్మానందం మానవాతీతం కాబట్టి లోతు నీళ్లల్లో మునిగినవాళ్లల్లా మనుష్యులు ఆఆనందం ఆట్టేసేపు భరించలేరు. ఈ హాస్యవచనం ఒక్కసారిగా ఆపెట్టెలోవున్న మానవ లోకానికి నిట్టూర్పు యిచ్చింది; తెప్పరిల్ల చేసింది. ఆబాలిక పాట మానివేసింది.

కొత్తగా వచ్చిన హాస్యకాడు జబ్బు హాస్యంతో ప్రారంభించాడు. తనకు తగని జబ్బున్నాడు. అది తిండిజబ్బు. భోజనానికి వెడితే మొగపెళ్లివారికి చేసిన శాకపాకాలన్ని తన విస్తట్లోనే మాయమహాత్తో వుండేవిట. వైద్యుడు ఇది 'మహా రోగం' అన్నాట్ట, దానికి ఉదయాన్నే మినపసున్ని తాటికాయలంత మాత్రలు చేసి ఒక శేరు తేనె పాకం అనుపానంగా ఒక డజను సేవించమన్నాట్ట.

ఇత్యాది హాస్యంతో కోమటి హాస్యం, బాపనహాస్యం, గొల్లహాస్యం, బుడబుడక్కల హాస్యం, కుక్కకూతలు, నక్కకూతలు కుప్పేశాడు. ఆరైలుపెట్టెలో మనుష్యులు విరగబడి నవ్వారు. కళ్లవెంబడి అందరికీ నీళ్లు కారినై. డొక్కలు నొక్కుకున్నారు; ఒకళ్ల మీద ఒకళ్లు పడ్డారు. ఎంతహాస్యానికన్నా చిరునవ్వులు మాత్రం వెదజల్లుతుంది హిందూ స్త్రీజనం. అక్కడ ఆడవాళ్లు ఒళ్లు మరచి నవ్వుపొంగుల్లో ఊగిపోయారు.

అక్కణ్ణుంచి డబ్బు వసూలు చేయడం ప్రారంభించాడు. కాన్లు, అణాకాసులు, అర్ధణాలు, రెండణాల కాసులు గళగళ అతనిహస్తంలోకి ప్రవహిస్తూ అక్కడే మాయమయ్యాయి. అతిగాడు కొంచెం 'గుంటుపల్లి భాస్కరుడి' ఇంద్రజాలంకూడా ఎరుగున్న వాడిలా కనబడ్డాడు. ఒకపన్నెండణాలు దాకా పోగుబడింది కాబోలు. అదంతా హూత్తని తెల్లపోయి చూస్తూవున్న ఒకకుఱ్ఱవాడి లాగులోంచి గలగల రాలించాడు—చిల్లరఅంతానూ; 'అమ్మదొంగా' అన్నాడు. పెట్టెఅంతా ఘొల్లుమని నవ్వింది.

"మీరు చల్లగా వుండాలి; నేను పచ్చగా వుండాలి; మీధాన్యాలు నాగాది నిండాలి; మీనవ్వులోంచి ధనవర్షం కురియాలి; జయావిజయీభవ! దిగ్విజయీభవ!! మీ రెప్పుడూ రైలు ప్రయాణం చేస్తూ వుండాలి. బాబూ, సెలవండి" అని తర్వాత స్టేషనులో దిగిపోయాడు. వేరేపెట్టె ఎక్కినాడు కాబోలు.

3

ఇంత సేపు ఆ గుడ్డిపిల్ల నిర్ఘాంతపోయి నిల్చున్నది. అప్పుడప్పుడు ఆ వేళాకోళం మాటలికి చిరునవ్వు నవ్వుకుంది. కూడావున్న ఆపిల్లవాడు పకాలున నవ్వుతూవున్నాడు హాస్యం పొడుగునా.

ఆబాలిక గొంతుకు సవరించుకుంది.

"ఎంతనీ వేడినా ఎక్కడా వుందువో
కంతుజనక రామా!"

అని హాయిమనేకృతి వక్కటి ఆలాపన చేసింది.

ఆహాసిగాడి మాటలే పక్క ఆయనికి జ్ఞాపకంచేస్తూ విరగబడి నవ్వుకుంటూవున్న ఒకముసలి కమ్మాయన "వుస్; పిల్లా, వుండు" అన్నాడు.

ఆబాలిక అల్లాగే నిలుచుండిపోయింది. ఆపసిపాప డబ్బు అడగడానికి వస్తే 'ఛీపో', 'ముట్టుకుంటావు', 'చిల్లర ఆయిపోయిందిరా' అని వరసగా అంటూనే వున్నారు.

ఆబాలిక అల్లాగే చైతన్యరహితంగా నిల్చునే వుంది: రయిలు కదిలిపోతూనే వుంది.

ఆరుకాన్లు వసూలయ్యాయి. ఆ అంధ బాలిక జ్ఞానశూన్యాలైన కళ్లల్లో వేడినీళ్లు తిరుగుతునే వున్నవి. ఆమెనిర్మలహృదయం మాటలేని ఏడుపులో సుడితిరిగింది. పిల్లవాడు వచ్చి ఆ అణాన్నర ఆబాలికచేతుల్లో పెట్టినాడు. ఆమె మొహంవంక తేరిపార చూశాడు. ఆమె చెయ్యి పట్టుకున్నాడు. వాడి లేతమనస్సు చివుక్కుమంది. వాళ్లిద్దరకూ ఒకళ్లహృదయం ఒకళ్లకి విస్పష్టమే. ఇద్దరూ ఒకతలువుమూల యిరికి కూలబడ్డారు; ఒదిగిపోయారు. చూపు లేని ఆబాలికకళ్లు, చూపు పుట్టని ఆపిల్లవాడి హృదయం ఒకటికొకటి ఆలింగనంచేసుకున్నవి. ఆబాలకుడు కంటినీరు ఆబాలికచేతులు అద్దుకుని ఆపుకోపోయాడు.

౪

బాలిక పాట ప్రారంభించకపూర్వమే ఒక వ్యక్తి ఆరైలుపెట్టె ఎక్కాడు. అతడూ రైలు బిచ్చగాడే. ఒక చెయ్యి లేదు.

ముప్పైఏళ్లుంటాయి. చింకిగుడ్డా, చిరిగిపోయినచొక్కాతో ఒకపిల్లంగ్రోవి ఎడంచేత్తో పట్టుకుని రైలు ఎక్కాడు. అప్పుడే ఆబాలిక తనదివ్యగానం ఆలాపనచేసింది. తర్వాత జరిగినకథ అంతా చూస్తూనే వున్నాడు.

ప్రపంచం అంటే కోపంగల మనిషి. వెనుక రైల్వే పోర్టరుగా వుండే, రైలుకింద పడిపోయి చేయిపోగొట్టుకున్నాడాబిచ్చగాడు. నాఅనేవారు లేకుండా వుండేవాడు. జీతంలో వొచ్చిన నాలుగురాళ్లు మిగుల్చుకుంటూ, గుడ్సుస్టేషనులో అప్పుడప్పుడు దొంగతనంచేసి నవస్తువులు అమ్మగా వచ్చిన డబ్బూ, రైలులోంచి దిగిన ప్రయాణీకుల సామానుమోయడంవల్ల వచ్చిన కూలి, టిక్కెట్టు లేనివాళ్లను ఇంజనుదగ్గరనుంచో, గార్డుపెట్టెదగ్గరనుంచో పోనిచ్చినందుకు లంచం, మామూళ్లు, అంతా కలిపి నూరురూపాయలు మూటకట్టాడు. ఇంతట్లో చెయ్యి పోయినందుకు రాజమంగ్రీ రైల్వే ఆస్పత్రిలో మూడునెలలు వున్నాడు. అప్పుడు తన యింటిలో దాచుకున్న డబ్బు ఎవ్వరో మటుమాయం చేశారు. ఉద్యోగం పోయింది. పెళ్లి లేదు. దాంతో అతనికి మతి పోయింది. దిక్కులేనివాడికి దేవుడుకాదు,తిరిపమే దిక్కు. బిచ్చగాళ్లకు కొందరు గురువులు వుంటారు. అతనిదగ్గిర పిల్లంగ్రోవి మాంచి బాగా వూదడం, అందుమీద వేదాంతం పాటలు, భక్తి పాటలు పాడడం నేర్చుకున్నాడు; రైలుబిచ్చం సాగించాడు. రైలేగా ద్రోహంచేసింది. ఆ వచ్చినడబ్బు కాఫీహోటల్లో తినడం; కల్లుపాకలదగ్గిర గొల్లపుల్లమ్మకూతురు పోసే 'ధవళ సుధారసం' గళగ్రాహంగా సేవించి, సింధూరానిమిషత్వం, మహాయోగంలో మైకం సంపాదించి అమరుడౌతూ వుంటాడు.

ఆలాంటివాడు ఆగుడ్డిపిల్ల పాట విన్నాడు. ఆతని మొఅకుమనస్సు గాలిలో వూగిపోయింది. దోహదం చేసిన మొండిచెట్టు విక

సించినట్లు చిగురు దాల్చింది. ఏ ఆవేశమో అతనికి తెలియదు, అతనికి కళ్లనీళ్లు తిరిగినై.

మనుష్యుల చంచలత్వమూ, కఠినత్వమూ అతనికి అసహ్యం వేసింది. ఎవ్వరూ లెక్కచేయకుండా ఆగుడ్డిపిల్లను నిరసించగానే ఆతను ముట్టె వంచిన కారుదున్న అయిపోయినాడు. తాను పొద్దుట్నుంచీ పోగుచేసుకున్న ఆరణాలడబ్బులూ ఆఅమ్మాయి చేతిలో వేసి రైలు ఆగగానే దిగి చక్కాపోయాడు. ఆ అమ్మాయికి ఇంతడబ్బు ఎవ రిచ్చారో తెలవలేదు. "దేవుడులాంటి దయగల ప్రభువు ఎవ రిచ్చారో!" అనుకున్నది.

౫

ఆ గుడ్డిపిల్లకు జ్ఞానం వచ్చినప్పటినుంచీ ఇల్లా ముష్టి ఎత్తుకుంటూ రైలుప్రక్క గ్రామంలో ఒకబహుకుటుంబీకుడు మంచి అంతఃకరణగల ఒకరైతు ఇంటిలో ఒకపంచను వుంటూవుండేది. ఊళ్లో ఒకపెద్దసంసారి బాలికకు సంగీతం నేర్పిస్తూవుంటే వీధివాకిట్లో కూర్చుని సంగీతం చెవులార వినేది. ఏకలవ్యుడులా అద్భుతమైన గానవిద్య సంపాదించుకుంది. ముష్టి బాగా వచ్చేది. ఆడబ్బు "మహాయిల్లాలైన" రైతుభార్యకు దాచ ఇచ్చేది.

పెద్దదవుతూన్నకొద్దీ ఏదో భయం, సిగ్గు కలుగుతూవుండేది. ముష్టికి తిన్నగా వెళ్లక ఇదివరకు పోగుచేసుకున్నడబ్బులు కర్చుచేసుకుని గంజికాచుకుంటూవుండేది. తల్లి ఎవరో, తండ్రి ఎవరో, ఎల్లా ఆరైతుఇంట్లో చేరిందో ఆ పిల్లకు ఏమీ తెలియదు.

ఒకరోజున చేబ్రోలు ముష్టికి పోయి మధ్యాహ్నం కాల్వగట్టున వంటచేసుకుంటూ వుండగా ఒకపసిపిల్లవాడు మూడేళ్లవాడు ఆ అమ్మాయి దగ్గిరకు వచ్చాడు. ఎక్కణ్ణుంచి వచ్చాడో. ఆగుడ్డిపిల్ల అతన్ని వళ్లోకి తీసుకుంది. అప్పట్నుంచివాళ్లిద్దరూ ఒకతల్లికడుపునబిడ్డల్లా అయ్యారు. అతడు దారి చూపించడం, ఆమె పాటపాడడం: అల్లా నాలుగేళ్లు గడిచినై.

౬

ఆరోజుసాయింత్రం కాల్వగట్టున వంట చేసుకుంటూ వుంది. పిల్లవాడు చితుకులు ఏరి తెచ్చి యిస్తున్నాడు. ఆసమయంలో ఆసంధ్యారుణకాంతుల్లో ఒకపురుషుడు ఆచెట్టుకిందికి వచ్చాడు. ఆతనిమొహం చిరునవ్వు నవ్వుతూ వుంది. కళ్లులేని ఆకబోది చెవులు, శరీరం, యావత్తూ అతిసున్నితమైన గ్రహణశక్తి సంపాదించుకున్నవి. ఆ కొత్తమనిషి రాక కనిపెట్టింది.

"ఒరే ఎవరురా ఆవచ్చింది? "

ఆపిల్లవాడు ఆమనిషిదగ్గిరకు పరుగెత్తుకుని వెళ్లాడు. ఆతనికుంటిచెయ్యి చూశాడు. పిల్లంగ్రోవి చూశాడు.

"ఆరోజుమనిషి."

ఆపిల్ల గ్రహించింది. ఆమె తెలతెలపోయింది. గుండె కొట్టుకుంది. తల వాల్చుకుని వంట చేస్తూనే వుంది.

ఆమనిషి పిల్లంగ్రోవి తీశాడు.

"ఏదిర లక్ష్మణ సీత
పర్ణశాలలో లే దెంతుశాత-"

అని పాట పాడినాడు. ఆ తేనెచుక్కల ధ్వని ఆసంధ్యఅంతా ఆక్రమించుకుంది. ఆపిల్లవాడు ఆతనిదగ్గరగా జేరి మొహం చూస్తూ కూచున్నాడు. ఆ అమ్మాయి వంట చేస్తూనే వుంది.

"రారోరి చిన్నవాడా మావాడా
రారోరి చిన్నవాడ-"

చీకట్లు పూర్తిగా అలుముకు వస్తూ వున్నవి. నక్షత్రాలు మినుకుమినుకు మంటూ ఆకాశాన్ని అలంకరించాయి.

"ఎందుకైనా వ్రుంచినావురా బంధికానాలో
రామయ్యతండ్రీ-"

ఆబాలిక వంట పూర్తి అయింది.నిప్పులు ఆర్పేసింది. బిచ్చగాడు ఆమె దగ్గరగా పోయి కూచున్నాడు.

ఎడంచేయి మొండిది. అది పిల్లంగ్రోవికి నొక్కికొని కుడిచేతివేళ్లతో ఊదుతాడు.

"నీకూ నీవారు లేరు నాకూ నావారు లేరు
ఏటిఒడ్డునా ఇల్లు కడదాం పదరా-"

ఆపాట అమృతమయంగా ఆచీకట్లలో వ్యాపించింది. కాల్వనీళ్లు నిర్మలంగా ప్రవహించినై.

"నాకు పెళ్లిలేదు. నేనూ ముష్టివాడినే. మనం యిద్దరం ఎందుకు పెళ్లి చేసికోకూడదు?"

ఆ అమ్మాయి ఆలోచించుకుంటూవుంది. వేయి ఆలోచన్లు పోయాయి. ఒళ్లు ఒణికింది. అప్రయత్నంగా ఆతని దగ్గరకు జరిగింది. ఆతని మొహం తడిమింది. దేహం తడిమింది. ఆమనుష్యుడికి వళ్లు జలదరించింది. ఆచింపిగుడ్డ అమ్మాయి అప్సరస లా తోచింది. తనజీవితం జ్ఞాపకంవచ్చింది. ఒకగుడిలో దేవతకడ మోకరించిన భక్తుడయ్యాడు. ఆబాలికను గట్టిగా తనగుండెకు అదుముకుందా మనుకున్నాడు. చూపులేని ఆకళ్లు చూసి కళ్ల నీళ్లు నింపుకున్నాడు. ఆబాలిక ఆతని తల నిమిరింది. కళ్లు తుడిచింది. ఆతనిగుణగణాలు ఏలా అర్థమయ్యేమో!

"ఆపిల్లవాడు నాకు తమ్ముడు. చిన్నతనాన్నుంచి పెంచుకున్నా."

"నాకూ తమ్ముడే, నాబిడ్డడే అవుతాడు. ఇక్కణ్నుంచి నేను పెంచుకుంటా."

ఆ నక్షత్రాలే సాక్షిగా, పక్కన ప్రవహించే గోదావరినీరు సాక్షిగా వాళ్లిద్దరూ ఆ శుభముహూర్తంలో భార్యాభర్త లయ్యారు. ఒకళ్ల కౌగిలింతలో ఒకళ్లు కలిసిమెలిసి కరిగిపోయారు. ఆపసిపిల్లవాడు హృదయంతో "తథాస్తు"అని నవ్వుకున్నాడు.